మా కలం.. మీ గళం..

# మన గళం

దిన పత్రిక

RNI : APTEL/ 2017/74310

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 264 | శుక్రవారం | 10 - 04 - 2026 | పేజీలు: 8 | వెల: 4

## మంత్రి సవితతో భేటీ



5లో..

## జగన్‌పై షర్మిల తీవ్ర విమర్శలు

- వైఎస్సార్ ఆశయాలకు విరుద్ధంగా పాలన అంటూ ఆరోపణలు
- వైఎస్సార్ పాదయాత్రకు 23 ఏళ్లు పూర్తి సందర్భంగా వ్యాఖ్యలు
- తండ్రి ఆశయాలను పాటించడం లేదని విమర్శలు
- ఆత్మవిమర్శన యాత్ర చేయాలని సూచన



విజయవాడ, మన గళం : ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, తన సోదరుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. వైఎస్ రాజశేఖర రెడ్డి చేపట్టిన చారిత్రాత్మక

2 లో..

## రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడిన ముఖ్యమంత్రి

- 'మీ భూమిమీ హక్కు' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు
- సూరేపల్లిలో కార్యక్రమంలో పాల్గొన్న సీఎం
- గ్రామ సర్వేయర్‌తో కలిసి పొలాల పరిశీలన
- రైతుల సమస్యలు తెలుసుకున్న ముఖ్యమంత్రి





బాపట్ల, మన గళం : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం సూరేపల్లిలో నిర్వహించిన 'మీ భూమిమీ హక్కు' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రైతుల భూ హక్కుల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం గ్రామ సర్వేయర్ స్వప్నతో కలిసి రైతులు వాకా శ్రీనివాసరావు, మూరల వెంకటేశ్వర్లుకు చెందిన పొలాలను సందర్శించారు. భూముల సర్వే, రికార్డుల వివరాలను పరిశీలిస్తూ రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

రైతుల భూ హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం

2 లో..

## మీడియా కార్యాలయాలపై దాడులు ఖండనీయం

అమరావతి, మన గళం : ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయాలపై వైసీపీ శ్రేణులు దాడులు చేయడాన్ని ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు తీవ్రంగా ఖండించారు.



- డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు
- వైసీపీ శ్రేణుల దాడులపై తీవ్ర ఆగ్రహం
- ప్రజాస్వామ్యంలో హింసకు స్థానం లేదని వ్యాఖ్య
- దాడులు పతనానికి సంకేతమని విమర్శలు

2 లో..

## గంటల్లోనే మిస్సింగ్ బాలిక ఆచూకీ



- కేడీపేట పోలీసుల చాకచక్యం
- మూడు గంటల్లోనే బాలికను గుర్తింపు
- మూడు బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం
- సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగింత

2 లో..

## మూడు రాష్ట్రాల్లో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



- అధిక శాతం ఓటింగ్ నమోదు
- కేరళలో 75.01% పోలింగ్ నమోదు
- అసోంలో 84.42% ఓటింగ్.. భారీ స్పందన
- పుదుచ్చేరిలో 86.92% పోలింగ్

డెస్క్, మన గళం : అసోం, కేరళ, పుదుచ్చేరి శాసనసభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

2 లో..

## జగన్‌పై చంద్రబాబు సెటైర్లు

- అమరావతే ఏకైక రాజధాని అని స్పష్టం
- 'మావిగన్' ప్రతిపాదనపై ఎద్దేవా
- అమరావతికి 49 పార్టీల మద్దతు ఉందని వ్యాఖ్య
- వైసీపీపై ఘాటు విమర్శలు



బాపట్ల, మన గళం : వైసీపీ అధ్యక్షుడు జగన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఏపీ రాజధానిగా జగన్ ప్రతిపాదించిన 'మావిగన్' కారిడార్ (మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు)పై ఎద్దేవా చేస్తూ, "రాజధానిగా వాటికన్‌ను సూచించనందుకు సంతోషం" అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అమరావతే ఆంధ్రప్రదేశ్‌కు ఏకైక,

2 లో..

## బంగాల్‌లో నందిగ్రామ్ ఫలితం మళ్లీ పునరావృతం అవుతుంది

- ప్రధాని మోదీ
- భవానీపుర్‌లోనూ అదే ఫలితం వస్తుందని వ్యాఖ్యలు
- టీఎంసీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- బీజేపీ విజయం ఖాయమని ధీమా



పశ్చిమ మేధినీపుర్, మన గళం : పశ్చిమ బెంగాల్‌లో రాబోయే ఎన్నికల్లో నందిగ్రామ్ ఫలితం మళ్లీ పునరావృతమవుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భవానీపుర్‌లో కూడా ఇదే పరిస్థితి

2 లో..

# జగన్‌పై షర్మిల తీవ్ర విమర్శలు

పాదయాత్రకు 23 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా సోషల్ మీడియా ద్వారా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.

వైఎస్సార్ పాదయాత్రను పేదల సంక్షేమం కోసం ప్రారంభించిన మహాయజ్ఞంగా అభివర్ణించిన షర్మిల, ఆయన కాంగ్రెస్ నాయకునిగా ప్రజల మద్దతుతో అధికారంలోకి వచ్చి చిరస్థాయిగా నిలిచారని గుర్తుచేశారు. అలాంటి నాయకుడి ఆశయాలను జగన్ కొనసాగించడం లేదని ఆరోపించారు. తండ్రి పేరును పార్టీకి పెట్టుకుని ఆయన ఆలోచనలకు విరుద్ధంగా పాలన సాగిస్తున్నారని విమర్శించారు. పేదలు, దళితులు, మైనారిటీలు, మహిళలు, రైతుల సంక్షేమం కోసం కృషి చేసిన వైఎస్సార్‌కు భిన్నంగా జగన్ పాలన ఉందని పేర్కొన్నారు. మత సామరస్యాన్ని కాపాడిన వైఎస్సార్‌తో పోలిస్తే, ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్రంతో రాజీ పడుతున్నారని షర్మిల ఆరోపించారు. బీజేపీ విధానాలపై జగన్ మౌనం పాటిస్తున్నారని విమర్శించారు.

జగన్ ఐదేళ్ల పాలనలో దళితులు, మహిళలు, మైనారిటీలపై జరిగిన ఘటనలు సమాజాన్ని కలవరపరిచాయని పేర్కొన్నారు. ఇవన్నీ వైఎస్సార్ ఆలోచనలకు విరుద్ధమని ఆమె వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో పాదయాత్ర కంటే ఆత్మవిమర్శన యాత్ర చేయాలని షర్మిల సూచించారు. వైఎస్సార్ ఆశయాలను నిజంగా గౌరవించాలంటే ఆయన విధానాలను అమలు చేయాలని ఆమె పేర్కొన్నారు.

# మీడియా కార్యాలయాలపై దాడులు ఖండనీయం

ప్రజాస్వామ్యంలో నిరసన వ్యక్తం చేసే పద్ధతులు వేరుగా ఉండాలని, భౌతిక దాడులు అమానుషమని ఆయన మండిపడ్డారు. గతంలో టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడిని ప్రస్తావిస్తూ, ఆ ఘటన తర్వాతే వైసీపీ 175 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయిందని అన్నారు. ఇప్పుడు మీడియాపై దాడులు చేయడం వారి పతనానికి పరాకాష్ఠగా మారుతుందని ఎద్దేవా చేశారు.

జగన్ ప్రతిపాదిస్తున్న 'మావిగన్' బిల్లుపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. ఆ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెడతానని చెప్పడం హాస్యాస్పదమని, అది ఎప్పటికీ సాధ్యంకాదని వ్యాఖ్యానించారు. ప్రజలకు ప్రతిరోజూ సినిమాలు చూపిస్తామన్న వ్యాఖ్యలపై కూడా ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర కీలకమని, అలాంటి సంస్థలపై దాడులు చేయడం సరైంది కాదని ఆయన స్పష్టం చేశారు. అభిప్రాయ భేదాలు ఉంటే చట్టపరమైన మార్గాల్లోనే పరిష్కారం కనుగొనాలని సూచించారు. తనపై జరిగిన చిత్రహింసలను ప్రస్తావిస్తూ, దోషులను చట్టం తప్పకుండా శిక్షిస్తుందని రఘురామకృష్ణరాజు హెచ్చరించారు. తమిళనాడులో జరిగిన జయరాజ్–బెన్నిక్స్ కేసు తరహాలోనే ఇక్కడ కూడా చర్యలు ఉంటాయని అన్నారు. ఈ నేపథ్యంలో సునీల్ కుమార్ తదితరులపై భయం పట్టుకుందని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడే దిశగా అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు.

# గంటల్లోనే మిస్సింగ్ బాలిక ఆచూకీ

విశాఖపట్నం, మన గళం : నర్సీపట్నం రూరల్ సర్కిల్ పరిధిలోని కేడీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో అదృశ్యమైన ఒక బాలికను పోలీసులు గంటల వ్యవధిలోనే సురక్షితంగా గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. కేసు నమోదైన కేవలం మూడు గంటల్లోనే బాలిక ఆచూకీ కనుగొనడం పోలీసుల సత్వర స్పందనకు నిదర్శనంగా నిలిచింది.

ఈ రోజు ఉదయం సుమారు 8:30 గంటలకు బాలిక మిస్సింగ్ అయినట్లు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అప్రమత్తమై గాలింపు చర్యలను ప్రారంభించారు. సంఘటనను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని తక్షణ చర్యలు చేపట్టారు.

నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ పి. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నర్సీపట్నం రూరల్ సి.ఐ. రేవతమ్మ పర్యవేక్షణలో కేడీపేట ఎస్సై రిషికేష్ రావు బృందంతో కలిసి రంగంలోకి దిగారు. ఈ ఆపరేషన్ కోసం మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. పోలీసు బృందాలు క్షేత్రస్థాయిలో గాలిస్తూనే సాంకేతిక సమాచారాన్ని విశ్లేషిస్తూ సమన్వయంతో వ్యవహరించాయి. ఈ క్రమంలో బాలిక తూర్పు గోదావరి జిల్లా గండిపేట ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అక్కడికి చేరుకుని బాలికను సురక్షితంగా స్వాధీనం చేసుకున్నారు.అనంతరం బాలికను సురక్షితంగా తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. సకాలంలో స్పందించి కేసును ఛేదించిన సి.ఐ. రేవతమ్మ, ఎస్సై రిషికేష్ రావు మరియు వారి సిబ్బందిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. పోలీసుల వేగవంతమైన చర్యలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయి. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పిల్లలు అదృశ్యమైనా లేదా అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా వెంటనే సమాచారం అందించాలని సూచించారు. ప్రజల అప్రమత్తతతోనే ఇలాంటి కేసులను త్వరగా ఛేదించగలమని పేర్కొన్నారు.

# రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడిన ముఖ్యమంత్రి



కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. భూమి రికార్డులను సక్రమంగా నమోదు చేసి, వివాదాలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'మీ భూమిమీ హక్కు' కార్యక్రమం ద్వారా పారదర్శకతను పెంచి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని సీఎం పేర్కొన్నారు. భూములపై ఎలాంటి అనిశ్చితి లేకుండా ప్రతి రైతుకు హక్కులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎం ఆదేశించారు. భూమి సంబంధిత వ్యవహారాల్లో ఆలస్యం లేకుండా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు.

# జగన్‌పై చంద్రబాబు సెటైర్లు



శాశ్వత రాజధాని అని ఆయన మరోసారి స్పష్టం చేశారు.

గురువారం బాపట్ల జిల్లా వేమూరులో జరిగిన బహిరంగ సభలో మాట్లాడిన చంద్రబాబు, అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బిల్లుకు ఎన్డీయే భాగస్వామ్య పక్షాలతో పాటు మొత్తం 49 పార్టీలు మద్దతిచ్చాయని తెలిపారు. కేవలం వైసీపీ మాత్రమే దీనికి వ్యతిరేకంగా నిలిచిందని విమర్శించారు.

వైసీపీపై తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ "గతంలో ఒక నాయకుడిని సైకో అనేవాళ్లం, ఇప్పుడు ఆ పార్టీ మొత్తమే అలాంటి పరిస్థితికి చేరింది" అని అన్నారు. గతంలో అమరావతి మహిళలను, అసెంబ్లీలో తన కుటుంబ సభ్యులను అవమానించారని ఆరోపిస్తూ ఇప్పుడు మహిళల గౌరవంపై మాట్లాడటం విరుద్ధంగా ఉందని వ్యాఖ్యానించారు. అమరావతి ప్రాజెక్ట్‌పై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని చంద్రబాబు ఆరోపించారు. ఇది స్వయం సమర్థతతో నడిచే ప్రాజెక్ట్ అని, రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నారన్న ఆరోపణలు అసత్యమని తెలిపారు. విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం ప్రాంతాల కలయికే సీఆర్‌డీఏ అని వివరించారు.

రాష్ట్రంలో శాంతి భద్రతలపై కూడా చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. విధ్వంసకర శక్తులు స్వేచ్ఛగా తిరిగితే మహిళల భద్రతకు ముప్పు ఏర్పడుతుందని హెచ్చరించారు. చట్టం తన పని తాను చేసుకుంటుందని, అవసరమైతే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

రాష్ట్ర పునర్నిర్మాణ ప్రక్రియ ప్రారంభమైందని పేర్కొంటూ ప్రజలు ఐక్యంగా నిలబడి అభివృద్ధికి సహకరించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. విధ్వంసకర శక్తులను ఓడించి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని కోరారు.

# బంగాల్‌లో నందిగ్రామ్ ఫలితం మళ్లీ పునరావృతం అవుతుంది

కనిపిస్తుందని ఆయన పేర్కొన్నారు.

పశ్చిమ మేదినీపూర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో మాట్లాడిన మోదీ, 2021 ఎన్నికల్లో నందిగ్రామ్‌లో మమతా బెనర్జీపై బీజేపీ నేత సువేందు అధికారి సాధించిన విజయాన్ని ప్రస్తావించారు. ఈసారి కూడా ప్రజలు అదే విధంగా తీర్పు ఇవ్వబోతున్నారని చెప్పారు. బంగాల్‌లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు సాధారణ ఎన్నికలు కావని, రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే కీలక ఎన్నికలని ఆయన పేర్కొన్నారు. బంగాల్ వైభవాన్ని పునరుద్ధరించడానికి ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. టీఎంసీ ప్రభుత్వంపై మోదీ తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి మార్గంలో తీసుకెళ్లకుండా వెనక్కి లాగుతోందని ఆరోపించారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు లేకపోవడం, ఉన్న అవకాశాలను కూడా చొరబాటుదారులకు ఇస్తున్నారని మోదీ ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో అవకతవకలు జరుగుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, బీజేపీకి విజయం ఖాయమని మోదీ ధీమా వ్యక్తం చేశారు. బంగాల్ అభివృద్ధి కోసం ప్రజలు సరైన నిర్ణయం తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# మూడు రాష్ట్రాల్లో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

డెస్క్, మన గళం : అసోం, కేరళ, పుదుచ్చేరి శాసనసభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడంతో చెదురుమదురు ఘటనలు మినహా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు.

కేరళ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 140 స్థానాలకు పోలింగ్ నిర్వహించగా సాయంత్రం 5 గంటల వరకు 75.01 శాతం ఓటింగ్ నమోదైంది. క్యూ లైన్లలో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్ కన్నూరులో ఓటు హక్కు వినియోగించుకోగా, కేంద్ర మంత్రి సురేశ్ గోపీ, ప్రతిపక్ష నేత వీడీ సతీషన్, రాజీవ్ చంద్రశేఖరన్, నటుడు మోహన్ లాల్ తదితరులు తమ ఓటు వేశారు. రాష్ట్రవ్యాప్తంగా 30,495 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి 1.46 లక్షల మంది సిబ్బంది విధులు నిర్వర్తించారు.

అసోంలో కూడా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 126 నియోజకవర్గాల్లో 722 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. సాయంత్రం 5 గంటల వరకు 84.42 శాతం పోలింగ్ నమోదైంది. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ గువాహటిలో ఓటు వేయగా, కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్ జోర్హాట్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 31,490 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున భద్రతా సిబ్బందిని నియమించారు.

కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో 30 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మొత్తం 294 మంది అభ్యర్థులు పోటీ చేశారు. సాయంత్రం 5 గంటల వరకు 86.92 శాతం పోలింగ్ నమోదైంది. ముఖ్యమంత్రి రంగస్వామి బులెట్ బండిపై వచ్చి ఓటు



వేయడం ఆకర్షణగా నిలిచింది. మాజీ సీఎం నారాయణస్వామి కూడా తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. మూడు ప్రాంతాల్లోనూ ఓటర్లు భారీగా పాల్గొనడం గమనార్హం. ఎన్నికల సంఘం పర్యవేక్షణలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా పూర్తికావడంతో అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఫలితాల కోసం రాజకీయ పార్టీలతో పాటు ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

శుక్రవారం
10 - 04 - 2026

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# పాత వాహనాల కొనుగోలులో అప్రమత్తత అవసరం

- చౌకగా వస్తున్నాయని రిజిస్ట్రేషన్ పత్రాలు లేని వాహనాలు కొనవద్దు
- ఇబ్బందులు పడవద్దు
- కర్నూలు జిల్లా ఎస్పీవిక్రాంత్ పాటిల్




మన గళం,కర్నూలు నేరవిభాగం : పాత వాహనాలను కొనుగోలు చేసే సమయంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, తక్కువ ధరకే వస్తున్నాయని ఆశపడి రిజిస్ట్రేషన్ పత్రాలు లేని వాహనాలు కొనవద్దని, ఆ వాహనాలను కొని ఇబ్బందులు పాలవ్వకూడదని కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ గురువారం జిల్లా ప్రజలకు తెలిపారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం, సరైన పత్రాలు లేని వాహనాలను కలిగి ఉండటం లేదా నడపడం నేరమని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా వాహన కొనుగోలుదారులు గమనించవలసిన ముఖ్యమైన అంశాలను ఎస్పీ వివరించారు.

ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు:

పత్రాల పరిశీలన: వాహనం కొనే ముందు రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ , ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికేట్ అసలైనవా కాదా అని రవాణా శాఖ వెబ్‌సైట్ ద్వారా సరిచూసుకోవాలన్నారు.

చాసిస్ మరియు ఇంజన్ నంబర్: వాహనంపై ఉన్న చాసిస్ నంబర్, ఇంజన్ నంబర్... ఆర్సీ బుక్‌లో ఉన్న వివరాలతో సరిపోలుతున్నాయో లేదో భౌతికంగా తనిఖీ చేయాలన్నారు.

యజమాని గుర్తింపు: వాహనం విక్రయించే వ్యక్తి అసలు యజమాని అవునో కాదో ధృవీకరించుకోవాలన్నారు. ఆధార్ కార్డ్ వంటి గుర్తింపు కార్డులను పరిశీలించాలన్నారు.

తక్కువ ధరకు ఆశపడొద్దు: మార్కెట్ ధర కంటే అతి తక్కువ ధరకు వాహనం లభిస్తుందంటే అది దొంగతనం చేయబడినది లేదా నేర చరిత్ర కలిగినది అయ్యే అవకాశం ఉందని గుర్తించాలన్నారు.

చట్టపరమైన చిక్కులు: “దొంగ వాహనాలు కొనుగోలు చేయడం శిక్షార్హం. ఒకవేళ మీరు కొన్న వాహనం దొంగతనానిది అని తేలితే, మీరు ఐపీసీ మరియు మోటారు వాహనాల చట్టం కింద కఠిన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని కర్నూల్ ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ గారు తెలిపారు.

ఇన్సూరెన్స్ క్లెయిమ్ : నకిలీ పత్రాలు ఉన్న వాహనాలకు ప్రమాదం జరిగినప్పుడు ఎటువంటి ఇన్సూరెన్స్ వర్తించదు. దీనివల్ల ఆర్థికంగా నష్టం వాటిల్లుతుందన్నారు.

కోర్టు కేసులు: ఒకవేళ ఆ వాహనం ఏదైనా క్రైమ్ లేదా రోడ్డు ప్రమాదంలో ఇన్వాల్వ్ అయి ఉంటే, ప్రస్తుత యజమానిగా మీరే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కావున, వాహనాల కొనుగోలు విషయంలో అప్రమత్తంగా ఉండి, చట్టపరమైన ఇబ్బందుల నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోవాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# క్షేత్రస్థాయి పరిశీలన



మన గళం,కర్నూలు వైద్యం : కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు గురువారం ఆసుపత్రిలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా ఆసుపత్రి ప్రాంగణంలోని న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్ సందర్శించిన ఆయన, అందులోని 3వ మరియు 4వ అంతస్తుల్లో జరుగుతున్న నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న సూపరింటెండెంట్, రోగులకు త్వరితగతిన సేవలు అందించేలా పనులను వేగవంతం చేయాలని అధికారులను మరియు కాంట్రాక్టర్లను ఆదేశించారు. అలాగే గ్రౌండ్ ఫ్లోర్ మరియు మొదటి అంతస్తు బ్లడ్ శాంపిల్స్ విభాగాలను తనిఖీ చేసి, శానిటేషన్ ను మరింత మెరుగుపరచాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం, ఆసుపత్రిలోని డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ పనులను ఆయన తనిఖీ చేశారు. ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. (మాతృ మరియు శిశు సంరక్షణ) వార్డును సందర్శించిన డాక్టర్ వెంకటేశ్వర్లు గారు, అక్కడ అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వార్డుల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, గర్భిణీలకు మరియు బాలింతలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు గారితో పాటు అడ్మినిస్ట్రేషన్ నుండి డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ శివ బాల, డాక్టర్ సునీల్ ప్రశాంత్, డాక్టర్ క్లింటన్, మరియు ఇతర ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# న్యాయవాదుల రక్షణ చట్టం పై తక్షణమే అసెంబ్లీలో తీర్మానం చేయాలి

- కోర్టు ఎదుట న్యాయవాదుల ధర్నా



మన గళం,కర్నూలు లీగల్ : కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా కోర్టు ఆవరణ లో న్యాయవాదులు గురువారం ధర్నా చేపట్టారు. కోర్టు విధులు బహిష్కరిస్తూ ఈ సందర్భంగా కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ బి చంద్రుడు ప్రధాన కార్యదర్శి పి మహేశ్వరి రెడ్డి ఐ ఏ ఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బిఎస్ రవికాంత్ ప్రసాద్ ,సీనియర్ న్యాయవాది కే ఓంకార్ లు మాట్లాడుతూ దేశంలో రోజురోజుకీ న్యాయవాదులపై భౌతిక దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చాలామంది న్యాయవాదులు న్యాయం కోసం కోర్టులో ప్రజల పక్షాన వాదన చేస్తుంటే ఇలాంటి దాడులకు దుండగులు తెగబడడం ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతమన్నారు. తక్షణమే న్యాయవాదుల పర్యవేక్షణ చట్టం ఏపీలో అమలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలుతీసుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల తక్కువ సమయంలో ఆ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేసి చట్టం తెచ్చారని, అలాగే ఏపీలో కూడా సీఎం నారా చంద్రబాబు నాయుడు రాబోయే క్యాబినెట్ సమావేశాల్లో ఈ చట్టానికి మొదటి అంశముగా ప్రాధాన్యత ఇచ్చి ఈ రాష్ట్రంలో జరుగుతున్నటువంటి న్యాయవాదులపై దాడులు, హత్యలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ధర్నా కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ బి. మద్దిలేటి ,ఈ .రాజేష్ ,బి. హుస్సేన్, సురేష్ ఐఏఎల్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ షఫీ, న్యాయవాదులు పాల్గొన్నారు.

# క్షతగాత్రులకు పరామర్శ



మన గళం,కర్నూలు : రోడ్డు ప్రమాదానికి గురైై కర్నూలు నగరంలోని కిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న బేతంచర్ల (కాలేజ్) జీ.భూపాల్ రెడ్డి కుమారుడు నవీన్ సాయి ని వైకాపా నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని డాక్టర్ల ను అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కుటుంబ సభ్యులకు దైర్యం చెప్పి,నవీన్ సాయి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం అశ్విని హాస్పిటల్ లో కిడ్నీలో రాళ్ల సమస్యతో చికిత్స పొందుతున్న కల్లూరు అర్బన్ 31వ వార్డు మాజీ కార్పొరేటర్ మిద్దె చిట్టెమ్మ సోదరుడు పెద్దన్న ను పరామర్శించి,మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు .అనంతరం కర్నూలు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో గుండె సంబంధిత సమస్యతో చికిత్స పొందుతున్న కల్లూరు మండలం వామసముద్రం గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి కార్యకర్త నారాయణను పరామర్శించి, నారాయణ ప్రస్తుత పరిస్థితిని డాక్టర్ల ను అడిగి తెలుసుకోని, మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు.

# బాలల్లో నేర స్వభావాన్ని నియంత్రించాలి




మన గళం,కర్నూలు లీగల్ : జాతీయ,రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. కబర్ధి, కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి గురువారం స్థానిక జిల్లా కోర్టు లోని న్యాయ సేవ సదన్ లో బాలల న్యాయ చట్టం గురించి అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. కబర్ధి మాట్లడుతూ అంతర్జాతీయ బాలల వడంబడిక ప్రకారం రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రత్యేక నిబందనలపై పోలీసు అధికారులు అవగాహన కలిగివుండాలని తెలిపారు . బాల నేరస్తుల్లో వుండే నేర స్వభావాన్ని ప్రాథమిక దశలోనే గుర్తించి వారికి కౌన్సిలింగ్, విద్యాబోధన ద్వారా వారిలో మార్పు తీసుకురావలసిన అవసరం ఎంతైనా వుందని తెలియజేశారు. బాల నేరస్తుల్లో నేర స్వభావాన్ని నియంత్రించి మంచి మార్గంలో నడిపించేందుకు అందరు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి పిలుపునిచ్చారు. జువినైల్ జస్టిస్ యాక్ట్ గురించి చైర్మన్ కమ్ ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ టి. అపర్ణ తెలియజేసారు . ప్రజా వినియోగ సేవల కోసం శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు వెంకట హరినాథ్ పలు రంగాలకు సంబంధించి ఎలాంటి సేవలలో లోపంగానీ, నష్టంగానీ, అన్యాయంగానీ జరిగితే తక్షణమే పర్మనెంట్ లోక్ అదాలత్, కర్నూలు వారికీ వినతిపత్రంతో పాటు, తగిన ఆధారాలతో సమర్పించాలని తెలిపారు . ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా అతి తక్కువ సమయంలో న్యాయం అందజేస్తామని తెలిపారు. మహిళా డి. ఎస్. పి. ఉపేంద్ర బాబు పిల్లలు కేసు ల పట్ల ఎలా విచారణ చెయ్యాలో పోలీసులకు తెలియజేశారు. మానసిక వైద్య నిపుణులు డాక్టర్ చంద్ర శేఖర్ గారు బాలుర మానసిక రుగ్మతలపై సూచనలు సలహాలు తెలియజేసారు. మానసిక సమస్యల పరిష్కారం కొరకు టోల్ ప్రీ నెంబర్ 14416 కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. కర్నూలు ప్రభుత్వ బాలుర పరిశీలన గృహం సూపరింటెంట్ హుసేన్ భాష మాట్లాడుతూ బాలుర సంక్షేమం గురుంచి వివరించి బాలల పట్ల పాటించాల్సిన నిబందనలు కేసుల విచారణ అంశాల గురుంచి వివరించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ జుబేదా బేగం పిల్లల దత్తత చట్టం గురుంచి వివరించారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్న వయస్సు లో గర్భం దరిస్తే వచ్చే దుష్ప్రభావాల గురించి వివరించే గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ విజయ , డి. సి. పి. ఓ. శారద, డిస్టిక్ ప్రొఫెషనరీ ఆఫీసర్ దివాకర్, జె. జె. బి. మెంబర్ మాదవి, ఒన్ స్టాప్ సిబ్బంది,చిల్డ్రన్స్ ఎన్జీవో మౌనిక, కర్నూలు జిల్లా ప్రత్యేక జువైనల్ పోలీస్ యూనిట్ సిబ్బంది , సంభందిత శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్లకు బ్రేక్

ముంబై,మన గళం : గత ఐదు రోజులుగా లాభాల దిశగా పరిగెత్తిన దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం ఒక్కసారిగా కుదేలయ్యాయి. అంతర్జాతీయ పరిస్థితులు, ముఖ్యంగా చమురు ధరల పెరుగుదలతో పాటు అమెరికాఇరాన్ మధ్య నెలకొన్న అనిశ్చితి మదుపరుల మనోభావాలను ప్రభావితం చేయడంతో భారీ అమ్మకాల ఒత్తిడి నెలకొంది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 931.25 పాయింట్లు పడిపోయి 76,631.65 వద్ద ముగియగా, నిఫ్టీ 222.25 పాయింట్లు కోల్పోయి 23,775.10 వద్ద స్థిరపడింది.

# వైశాఖ శుద్ధ సప్తమి రోజును భగీరథ జయంతి ఉత్సవంగా ప్రభుత్వం జీవో అమలు చేయాలి

మన గళం కర్నూలు: పర్ల గ్రామానికి చెందిన రాష్ట్ర సగర (ఉప్పర)కార్పొరేషన్ చైర్మన్ ఉప్పరి రామ్ గిడ్డయ్య మరియు 15 మంది డైరెక్టర్లు అందరూ కలిసి విజయవాడ లోని గొల్లపూడి బీసీ భవనంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ మరియు సభ్యులు చర్చించిన విషయాల్లో మొట్ట మొదటిది ఏప్రిల్ 23 వ తారీకు వైశాఖ శుద్ధ సప్తమి రోజున జరిగే భగీరథ జయంతి ఉత్సవాన్ని పెర్మనెంట్ జీవో ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు అలాగే రెండో అంశము సగర కులమును బిసి డి నుంచి బీసీ ఏ కు మార్చాలని వారు ఇచ్చిన వినతిపత్రంలో పొందుపరిచారు అలాగే రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లకు టీటీడీ దేవస్థానంలో కుటుంబ సభ్యులు పరిమితి కాకుండా అదర్స్ విఐపి దర్శనం ఇవ్వాలని వినతి పత్రంలో పొందుపరిచారు అలాగే బీసీ కార్పొరేషన్ లోన్లు వెసులుబాటు చేయాలని ఆదరణ 3.0 క్రింద వారి యొక్క స్కిల్ సంబంధించిన పనిముట్లు కూడా ఇవ్వాలని వారు కోరుకున్నారు పై విషయాలను చర్చించి బీసీ మంత్రి సవితమ్మ కు ఉప్పర కార్పొరేషన్ చైర్మన్ మరియు 15 మంది సభ్యులు కలిసి వారికి వినతి పత్రాన్ని అందజేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర సగర( ఉప్పర) కార్పొరేషన్ చైర్మన్ మరియు డైరెక్టర్లు పాల్గొన్నారు.





## భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

**– జలధారజల హారతి కార్యక్రమం ద్వారా నీటి భద్రత బలోపేతం గ్రామ స్థాయి ప్రణాళికలపై కలెక్టర్ సమీక్ష –దజిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.**

మన గళం,కర్నూలు కలెక్టరేట్ : భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. గురువారం కోసిగి మండలం డి. బెలగల్ గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో “జలధారజల హారతి” కార్యక్రమంలో భాగంగా గ్రామ స్థాయి నీటి ప్రణాళికలపై జిల్లా కలెక్టర్ గ్రామ ప్రజలు, సాగునీటి సంఘాల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో నీటి భద్రత ను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో ఎక్కువ నీటిని వినియోగించే వరి వంటి పంటల స్థానంలో తక్కువ నీటితో పండే పంటలను రైతులు ఎంచుకోవాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100 రోజుల ప్రత్యేక కార్యాచరణ కార్యక్రమం “జలధారజల హారతి” ద్వారా నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా చెరువులు, చెక్‌డ్యామ్‌లు మరమ్మతులు, పూడికతీత పనులు ఉపాధి హామీ పథకంతో వేగవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకోవడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశమని అన్నారు. గ్రామాలలో సంవత్సరాలుగా ఉపయోగంలో లేని చెక్‌డ్యామ్‌లు, చెరువులలో పెరిగిన పిచ్చి మొక్కలను బుష్ క్లియరెన్స్ ద్వారా శుభ్రపరిచి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. జిల్లాలో కోసిగి ప్రాంతంలో భూగర్భ జలాలు సుమారు 29 మీటర్ల లోతులో ఉన్నాయని పేర్కొంటూ, వాటిని పెంపొందించేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీటిని వృథా కాకుండా కుంటలు, వాగులు, చెరువులలో నిల్వ చేసే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం స్థానిక నాయకులు, సాగునీటి సంఘాల నాయకులతో మరియు సంబంధిత అధికారులతో కలిసి గ్రామానికి సంబంధించిన భూగర్భ జలాలను పెంపొందించే గ్రామ ప్రణాళిక మ్యాప్ మరియు సంబంధిత అంశాలను కలెక్టర్ చర్చించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఆదోని సబ్ కలెక్టర్ (ఇంచార్జి) అజయ్ కుమార్, డ్వామా పి.డి నరసింహారెడ్డి, ఇరిగేషన్ ఎస్.ఈ బాలచంద్రరెడ్డి, ఎల్.ఎల్.సి చైర్మన్ టిప్పు సుల్తాన్, సాగునీటి సంఘం అధ్యక్షులు అనంతసేనారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ నరస రెడ్డి, తహసీల్దార్ వేణు గోపాల్ శర్మ, ఎంపీడీవో యస్.యం భాషా తదితరులు పాల్గొన్నారు.

## ప్రాంతాలకు అతీతంగా ఆర్యవైశ్యులు అందరూ కలిసికట్టుగా ఉండాలి

**– రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్**

మన గళం,కర్నూలు : ప్రపంచంలో ఉన్న ఆర్యవైశ్యులందరూ ప్రాంతాలకు అతీతంగా కలిసిమెలిసి ఉండాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నూతన అధ్యక్షునిగా ఎన్నికైన అమరవాది లక్ష్మీనారాయణ ఈరోజు టీజీ స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నూతన అధ్యక్షులుగా ఎన్నికైన అమరవాది లక్ష్మీనారాయణ, ఇల్లూరు లక్ష్మయ్య లను టీజీ వెంకటేష్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర తెలంగాణ ప్రాంతాలు వేరైనప్పటికీ ఆర్యవైశ్యులంతా ఒకటేనని అన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు దేశవ్యాప్తంగా ఉన్నటువంటి 45 మంది ఆర్యవైశ్య ఎంపీలను ఏకతాటిపై తెచ్చి ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్టు తెలిపారు. ప్రాంతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి ఉన్నప్పుడే సమస్యల పరిష్కారానికి సులువైన మార్గాలు లభిస్తాయిని టీజీ వెంకటేష్ తెలిపారు. ఆర్యవైశ్యులకు ఎటువంటి సమస్యలు వచ్చినా తాను ముందుండి సహాయ సహకారాలు అందిస్తానని టీజీ తెలిపారు. తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ నూతనంగా నిర్మించ తలపెట్టిన భవన



సముదాయలకు తన వంతుగా సహకారం అందిస్తానని టీజీ వెంకటేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ నాయకులు ఇరుకుల రామకృష్ణ, శంషాబాద్ గణేష్, శ్రీనివాస్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం ఇంటిపై సోలార్ ప్యానెల్స్‌కి రూ.78,000 సబ్సిడీ



న్యూఢిల్లీ, మన గళం :ప్రతి నెలా పెరుగుతున్న విద్యుత్ బిల్లులు సామాన్య కుటుంబాల బడ్జెట్‌ను భారంగా మార్చుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం “పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన“ను ప్రారంభించింది. ఈ పథకం కింద ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తే, విద్యుత్ బిల్లులు దాదాపు సున్నా అవుతాయి. ప్రభుత్వం గరిష్టంగా రూ.78,000 వరకు సబ్సిడీ అందిస్తోంది. 1 కిలోవాట్ సిస్టమ్‌కు రూ.30,000, 2 కిలోవాట్‌కు రూ.60,000, 3 కిలోవాట్ లేదా అంతకంటే ఎక్కువ సామర్థ్యానికి రూ.78,000 నేరుగా బ్యాంక్ ఖాతాలో జమ అవుతుంది. దీని ద్వారా సాధారణ ప్రజలు భారీ పెట్టుబడి లేకుండా సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవచ్చునని ప్రభుత్వం పేర్కొంది.

మిగిలిన ఖర్చుల కోసం బ్యాంకులు తక్కువ వడ్డీ రేట్లతో రుణాలను అందిస్తున్నాయి. రుణ ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లో జరుగుతుంది. ఆధార్, విద్యుత్ బిల్లు, మొబైల్ నంబర్ వంటి ప్రాథమిక పత్రాలతో 1520 నిమిషాల్లో దరఖాస్తు పూర్తి చేయవచ్చు. ఒకటి లేదా రెండు రోజుల లోపు రుణం మంజూరు అవుతుంది. ఈ పథకం కింద 10 సంవత్సరాల తిరిగి చెల్లింపు గడువు, ప్రారంభంలో 6 నెలల మారటోరియం సౌకర్యం కూడా ఉంది. అదనంగా ‘నెట్ మీటరింగ్’ ద్వారా మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించి అదనపు ఆదాయం పొందవచ్చు.

సోల్ విద్యుత్ వైపు మారడం వల్ల ఖర్చులు తగ్గడమే కాకుండా దీర్ఘకాలిక ఆర్థిక భద్రత కూడా లభిస్తుంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం సామాన్యులకు విద్యుత్ స్వావలంబన సాధించడానికి ఒక కీలక అవకాశం అని ప్రత్యేకంగా సూచిస్తోంది.

# హోమియోపతి వైద్య శాస్త్ర విశిష్టత

**– ప్రపంచ హోమియోపతి దినోత్సవం**
**– శామ్యూల్ హనీమాన్ ఆవిష్కరణలు**
**– ప్రజారోగ్యంలో హోమియోపతి పాత్ర**



మన గళం, : ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 10వ తేదీని హోమియోపతి దినోత్సవంగా జరుపుకోవడం ఒక ఆనవాయితీగా వస్తోంది. ఈ వైద్య విధానాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడు డాక్టర్ శామ్యూల్ హనీమాన్ జయంతిని పురస్కరించుకుని ఈ వేడుకలు నిర్వహిస్తారు. జర్మనీకి చెందిన ఆయన అప్పట్లో ఉన్న కఠినమైన వైద్య పద్ధతులకు ప్రత్యామ్నాయంగా ఎంతో సరళమైన మరియు ప్రభావవంతమైన ఈ విధానాన్ని కనుగొన్నారు. మానవ శరీరానికి ఎటువంటి హాని కలగకుండా కేవలం వ్యాధిని మాత్రమే నివారించడం ఈ శాస్త్రం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. అందుకే దీనిని సురక్షితమైన వైద్యంగా ప్రపంచం గుర్తిస్తోంది.

హోమియోపతి చికిత్సలో రోగి యొక్క శారీరక లక్షణాలతో పాటు మానసిక స్థితిని కూడా క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ప్రతి మనిషి తత్వం వేరుగా ఉంటుందని మరియు ఒకే రకమైన వ్యాధి ఉన్నా అందరికీ ఒకే మందు పనిచేయదని ఈ శాస్త్రం నమ్ముతుంది. అందుకే వైద్యులు రోగితో ఎక్కువ సమయం గడిపి వారి అలవాట్లు మరియు ఇతర అంశాలను అడిగి తెలుసుకుంటారు. ఈ విధానం వల్ల వ్యాధి మూలాల నుండి నయం కావడానికి అవకాశం ఉంటుంది. నేటి ఆధునిక కాలంలో కూడా కోట్లాది మంది ప్రజలు హోమియోపతి మందులపైనే పూర్తి నమ్మకాన్ని ఉంచుతున్నారు. ఈ వైద్య విధానంలో ఉపయోగించే మందులు సహజ సిద్ధమైన మూలికలు మరియు ఖనిజాల నుండి తయారు చేయబడతాయి. వీటిని అతి తక్కువ మోతాదులో అందించడం వల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు మరియు గర్భిణీ స్త్రీలకు ఈ మందులు ఎంతో మేలు చేస్తాయి. దీర్ఘకాలిక వ్యాధులైన చర్మ సమస్యలు, శ్వాసకోశ ఇబ్బందులు మరియు కీళ్ల నొప్పులకు హోమియోపతిలో శాశ్వత పరిష్కారం లభిస్తుంది. రసాయనాలతో కూడిన మందుల కంటే సహజమైన ఈ పద్ధతిని వాడటం వల్ల శరీరం అంతర్గతంగా దృఢంగా మారుతుంది.

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో హోమియోపతి వైద్యానికి ఆదరణ విపరీతంగా పెరుగుతోంది. ప్రభుత్వం కూడా ఆయుష్ విభాగం ద్వారా గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక ఆసుపత్రులను నడుపుతోంది. నిపుణులైన వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ నాణ్యమైన చికిత్స అందిస్తున్నారు. అనేక ప్రైవేట్ సంస్థలు కూడా ఈ రంగంలో పరిశోధనలు చేస్తూ కొత్త మందులను అందుబాటులోకి తీసుకువస్తున్నాయి. హోమియోపతి మందులు తక్కువ ధరకు లభించడం వల్ల పేద మరియు మధ్యతరగతి వర్గాలకు ఇది గొప్ప వరంగా మారింది. దీనిపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాల్సిన అవసరం ఉంది. డిజిటల్ విప్లవం వల్ల హోమియోపతికి సంబంధించిన సమాచారం సామాన్య ప్రజలకు సులభంగా చేరుతోంది. ఆన్లైన్ వేదికల ద్వారా వైద్య సలహాలు పొందడం మరియు మందులు ఆర్డర్ చేయడం సులభమైంది. అయినప్పటికీ అనుభవం ఉన్న వైద్యుడి పర్యవేక్షణలోనే మందులు వాడాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రపంచ హోమియోపతి దినోత్సవం సందర్భంగా అనేక అవగాహన సదస్సులు మరియు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. వైద్య రంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకుంటూ హోమియోపతి మరింత ముందుకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




వ్యాధి నిరోధక శక్తిని పెంచడంలో హోమియోపతి కీలక పాత్ర పోషిస్తోంది. మహమ్మారి వ్యాధులు వ్యాపిస్తున్న సమయంలో ఈ మందులు ఎంతో మందికి రక్షణ కవచంలా పనిచేశాయి. కేవలం వ్యాధి వచ్చినప్పుడే కాకుండా ముందుజాగ్రత్తగా కూడా హోమియోపతి మందులను వాడవచ్చు. శామ్యూల్ హనీమాన్ కలలుగన్న ఆరోగ్యవంతమైన సమాజం కోసం ఈ వైద్యం నిరంతరం కృషి చేస్తోంది. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ఈ విధానం గురించి తెలుసుకోవడం మరియు ఇతరులకు వివరించడం చాలా ముఖ్యం. అప్పుడే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుంది. హోమియోపతి వైద్య విద్యను అభ్యసించే విద్యార్థుల సంఖ్య కూడా ఏటా పెరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కళాశాలల్లో అత్యుత్తమ ప్రమాణాలతో బోధన సాగుతోంది. పరిశోధన రంగంలో భారత్ ప్రపంచ దేశాలకు మార్గదర్శకంగా నిలుస్తోంది. ఇక్కడ తయారవుతున్న హోమియోపతి మందులు ఇతర దేశాలకు కూడా ఎగుమతి అవుతున్నాయి. ఇది కేవలం ఒక చికిత్స పద్ధతి మాత్రమే కాదు ఒక సంపూర్ణ జీవన విధానం. ఆహార నియమాలు మరియు క్రమశిక్షణతో కూడిన జీవితం గడపాలని హోమియోపతి బోధిస్తుంది. నిత్య జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించడానికి కూడా ఇందులో చికిత్సలు ఉన్నాయి. ఈ ఉత్సవాలను జయప్రదం చేయాలని వైద్య సంఘాలు కోరుతున్నాయి. హనీమాన్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకుంటారు. ప్రభుత్వం కూడా ఈ రంగానికి మరిన్ని నిధులు కేటాయించి పరిశోధనలను ప్రోత్సహించాలని ప్రజలు కోరుతున్నారు. అందరికీ సమానమైన మరియు సరసమైన వైద్యం అందడమే ఈ దినోత్సవ లక్ష్యం. స్వచ్ఛమైన మనస్సుతో మరియు నమ్మకంతో హోమియోపతిని ఆదరిస్తే దీర్ఘకాలిక సమస్యల నుండి విముక్తి పొందవచ్చు. ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఆశిద్దాం.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

## తోబుట్టువుల అనుబంధం

మానవ పరిణామ క్రమంలో కుటుంబం అనేది ఒక ప్రాథమిక విభాగం అయితే, ఆ కుటుంబానికి వెన్నెముక వంటి వారు తోబుట్టువులు. మారుతున్న కాలంతో పాటు ఎన్ని సాంకేతిక విప్లవాలు వచ్చినా, మనుషుల మధ్య భావోద్వేగ బంధాల అవసరం ఏ మాత్రం తగ్గలేదు. నేషనల్ సిబ్లింగ్స్ డే లేదా తోబుట్టువుల దినోత్సవం కేవలం ఒక పాశ్చాత్య సంస్కృతిగా చూడకుండా, మన రక్త సంబంధాలలోని గాఢతను పునరాలోచించుకునే సందర్భంలా భావించాలి. ఒకే గర్భాన జన్మించి, ఒకే గూటిలో పెరిగి, జీవితాంతం ఒకరి నీడన మరొకరు నిలిచే అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్ల బంధం వర్ణనాతీతం. ఈ రోజున మనం ఆ బంధాలలోని మాధుర్యాన్ని, బాధ్యతలను మరోసారి గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత సమాజంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగై వ్యష్టి కుటుంబాలు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో తోబుట్టువుల మధ్య ఉండాల్సిన సహజమైన అనుబంధం కూడా యాంత్రికంగా మారుతోంది. ఆస్తి తగాదాలు, అహంకారాలు మరియు కమ్యూనికేషన్ గ్యాప్ కారణంగా చాలా మంది తోబుట్టువులు ఒకరికొకరు దూరమవుతున్నారు. కానీ, సంక్షోభ సమయాల్లో లేదా మానసిక ఒత్తిడి ఎదురైనప్పుడు మనకు లభించే మొదటి ఓదార్పు మన తోబుట్టువుల నుండే వస్తుంది. తల్లిదండ్రుల తర్వాత మనల్ని అత్యంత దగ్గరగా చూసిన వారు వారే కాబట్టి, మన కష్టసుఖాలను వారు అర్థం చేసుకున్నంతగా మరెవరూ అర్థం చేసుకోలేరు. అందుకే ఈ బంధాన్ని కేవలం పండుగలకే పరిమితం చేయకుండా నిత్యం కాపాడుకోవాలి.

చిన్నతనంలో బొమ్మల కోసం గొడవపడటం నుండి, పెద్దయ్యాక ఒకరి అభివృద్ధిని చూసి మరొకరు మురిసిపోవడం వరకు ఈ ప్రయాణంలో ఎన్నో మలుపులు ఉంటాయి. అన్నదమ్ముల మధ్య ఉండే ఆ ధైర్యం, అక్కాచెల్లెళ్ల మధ్య ఉండే ఆ గారాబం ఇవన్నీ మన వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడతాయి. ఒక సోదరుడు తన సోదరికి ఇచ్చే రక్షణ, ఒక సోదరి తన సోదరుడికి చూపే మాతృప్రేమ వంటివి సమాజంలో నైతిక విలువలను పెంపొందిస్తాయి. ఒంటరితనం అనేది శాపంగా మారుతున్న ఈ రోజుల్లో, తోబుట్టువుల తోడు ఒక పెద్ద వరంగా మారుతుంది. ఏ సమస్య వచ్చినా 'నేనున్నానంటూ' భుజం తట్టే ఒక తోబుట్టువు ఉంటే ప్రపంచాన్ని గెలవగలమనే ధైర్యం కలుగుతుంది. ఆధునిక జీవనశైలిలో పని ఒత్తిడి వల్ల రక్త సంబంధీకులతో మాట్లాడే సమయం కూడా దొరకడం లేదు. సంవత్సరానికి ఒకసారి కలిసే పండుగలు కూడా ఇప్పుడు మొక్కుబడిగా మారుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో తోబుట్టువుల దినోత్సవం వంటి ప్రత్యేక రోజులు మనల్ని మళ్ళీ కలుపుతాయి. కేవలం సోషల్ మీడియాలో ఫోటోలు పెట్టి శుభాకాంక్షలు చెప్పడం కంటే, నేరుగా కలిసి గంట సేపు మనసు విప్పి మాట్లాడుకోవడం ఎంతో మేలు చేస్తుంది. ఒకరి సమస్యలను మరొకరు పంచుకుని, వారికి చేతనైన సహాయం అందించడమే ఈ రోజుకు ఇచ్చే నిజమైన గౌరవం. బంధాల కంటే భౌతిక సంపద ఏనాటికీ గొప్పది కాదని గుర్తించాలి. భారతీయ సంస్కృతిలో అన్నదమ్ముల బంధానికి రామాయణ, భారతాల కాలం నుండి ఒక విశిష్టత ఉంది. రాముడు-లక్ష్మణుల అనుబంధం, కుంతీ పుత్రుల ఐకమత్యం మనకు స్ఫూర్తిదాయకం. ఈ వారసత్వాన్ని నేటి తరం కూడా కొనసాగించాల్సిన బాధ్యత ఉంది. నేటి సమాజంలో పెరుగుతున్న నేరప్రవృత్తికి, విచ్ఛిన్నమవుతున్న కుటుంబ వ్యవస్థకు ప్రధాన కారణం మనుషుల మధ్య ప్రేమ లోపించడమే. తోబుట్టువుల మధ్య సఖ్యత ఉంటే ఆ కుటుంబం అభివృద్ధి చెందడమే కాకుండా, సమాజానికి ఒక మంచి మార్గదర్శిగా నిలుస్తుంది. ఐకమత్యమే మహాబలమనే సూత్రాన్ని తోబుట్టువులు ఆచరణలో చూపిస్తే అది జాతి నిర్మాణానికి ఉపయోగపడుతుంది.

పిల్లల్లో చిన్నతనం నుండే తోబుట్టువుల పట్ల ప్రేమను, బాధ్యతను పెంపొందించడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకం. వారి మధ్య పోటీని కాకుండా సహకారాన్ని ప్రోత్సహించాలి. అప్పుడే వారు పెద్దయ్యాక కూడా ఒకరికొకరు అండగా ఉంటారు. ఆస్తిపాస్తుల కంటే అన్నదమ్ముల అనుబంధం మిన్న అనే భావజాలాన్ని పిల్లల మనస్సుల్లో నాటాలి. నేటి విద్యా వ్యవస్థలో మార్కులపై ఉన్న శ్రద్ధ మనుషుల మధ్య ఉండాల్సిన సంబంధాలపై లేదు. అందుకే విద్యా సంస్థలు కూడా ఇలాంటి ప్రత్యేక దినోత్సవాల ప్రాముఖ్యతను వివరించాలి. తద్వారా రాబోయే తరాల్లో సామాజిక స్పృహ మరియు కుటుంబ విలువల పట్ల గౌరవం పెరుగుతుంది. డిజిటల్ విప్లవం మనుషులను దగ్గర చేసినట్టే చేసి దూరం చేస్తోంది. ఒకే ఇంట్లో ఉండి కూడా పక్క గదిలో ఉన్న తోబుట్టువుతో ఫోన్ లో మెసేజ్ చేసే పరిస్థితి వచ్చింది. ఇది మానవ సంబంధాలలోని గాఢతను తగ్గిస్తుంది. కళ్ళల్లో కళ్ళు పెట్టి మాట్లాడే ఆత్మీయతకు ఏ యాప్ సాటిరాదు. ఏప్రిల్ 10న వచ్చే ఈ దినోత్సవం మనలోని ఆత్మీయతను మళ్ళీ తట్టిలేపాలి. కేవలం రక్త సంబంధీకులకే కాకుండా, తోబుట్టువుల వలె కలిసి మెలిసి ఉండేవారికి కూడా ఈ రోజు శుభాకాంక్షలు చెప్పవచ్చు. వసుధైక కుటుంబం అనే భావన మన ఇంట్లోని తోబుట్టువుల బంధం నుండే ప్రారంభం కావాలి. తోబుట్టువుల దినోత్సవం అనేది ఒక కేవలం వేడుక కాదు, అదొక సామాజిక అవసరం. ఈ రోజున ప్రతి ఒక్కరూ తమ సోదర సోదరీమణులతో ఉన్న విభేదాలను పక్కన పెట్టి, ప్రేమానురాగాలతో ఒక్కటి కావాలి. రక్త సంబంధం అనేది దేవుడు ఇచ్చిన వరం, దానిని అశ్రద్ధ చేయకూడదు. మన ఎదుగుదలలో భాగస్వాములైన వారిని ఎల్లప్పుడూ గౌరవించాలి. ఈ ఏప్రిల్ 10న మన తోబుట్టువుల ముఖంలో చిరునవ్వు నింపుదాం. వారితో కలిసి పంచుకునే ప్రతి క్షణం జీవితాంతం గుర్తుండిపోయే మధుర జ్ఞాపకం కావాలి. అనుబంధాల సుగంధం ప్రతి ఇంట్లో వెల్లివిరియాలని ఆశిస్తూ అందరికీ తోబుట్టువుల దినోత్సవ శుభాకాంక్షలు.

# మంత్రి సవితతో భేటీ



మన గళం న్యూస్ నెట్ వర్క్ : గురువారం రాష్ట్ర సగర (ఉప్పర)కార్పొరేషన్ చైర్మన్,15 మంది డైరెక్టర్లు తొలిసారి భేటీ అయ్యారు. ఆ భేటీ గొల్లపూడి బీసీ భవనంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఏప్రిల్ 23 వ తారీకు వైశాఖ శుద్ధ సప్తమి రోజున జరిగే భగీరథ జయంతి ఉత్సవానికి సంబంధించి పెర్మనెంట్ జీఓ ఇవ్వాలని ప్రభుత్వాన్ని వారు కోరారు. రెండో అంశం సగర కులాన్ని బీసీడీ నుంచి బిసిఏకి మార్చాలని ప్రతిపాదించారు. రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లకుతితిదే లో కుటుంబ సభ్యులు కాకుండా పరిమితి కాకుండా ఇతరులకు విఐపి దర్శనం ఇవ్వాలని కోరారు. మూడో అంశం బీసీ కార్పొరేషన్ లోన్లు వెసులుబాటు చేయాలని ఆదరణ 3.0 క్రింద వారి యొక్కప్రతిభకు సంబంధించిన పనిముట్లు కూడా ఇవ్వాలని కోరారు. ఈ విషయాలను చర్చించి బీసీ మంత్రి సవితమ్మ కి వినతిపత్రాన్ని వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పర సంఘం ఛైర్మెన్,డైరెక్టర్లు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్ర జోనల్ మీటింగ్ విజయవంతం





మన గళం,విశాఖపట్నం : గురువారం నగరంలో భాజపా కార్యాలయంలో ఉత్తరాంధ్ర జోనల్ మీటింగ్ జరిగింది. జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఎస్.ఐ.ఆర్. కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ ఉత్తరాంధ్ర జోనల్ మీటింగ్ విజయవంతమైంది. ఈ సమావేశంలో వివిధ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లకు బిఎల్ఏ-1 పత్రాలను అందజేయడం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నిర్వహణలో సమన్వయం, బాధ్యతలపై చర్చించారు.

# వైకాపా నేతల నిరసన



మన గళం,ఆదోని : వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థ అధినేత రాధాకృష్ణ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో భారీ నిరసన కార్యక్రమాలు జరిగాయి. ఈ నిరసన కార్యక్రమాలలో భాగంగా ఆదోని నియోజకవర్గ కేంద్రం అయిన ఆదోని పట్టణంలో మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో నిరసన కార్యక్రమం చేపట్టబడింది. ఈ కార్యక్రమంలో కర్నూల్ పార్లమెంట్ సమన్వయకర్త, మాజీ పార్లమెంట్ సభ్యురాలు బుట్టా రేణుక పాల్గొన్నారు. నిరసన కార్యక్రమం సందర్భంగా సాయి ప్రసాద్ రెడ్డి నివాసం నుండి ఆదోని పట్టణంలోని రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించబడింది. ర్యాలీ అనంతరం రాధాకృష్ణపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా "రాధాకృష్ణ డౌన్ డౌన్", "మహిళల అవమానాన్ని సహించం" వంటి నినాదాలతో పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ముందుగా బుట్టా రేణుక మాట్లాడుతూ, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఛానల్‌లో ప్రసారమవుతున్న "వీకెండ్ విత్ ఆర్కే" కార్యక్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుల కుటుంబ సభ్యులపై, ముఖ్యంగా మహిళలపై చేసిన వ్యాఖ్యలు అత్యంత అభ్యంతరకరమైనవి, అసభ్యకరమైనవి , మహిళల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని తీవ్రంగా ఖండించారు. ఇటువంటి వ్యాఖ్యలు చేయడం మీడియా నైతిక విలువలకు విరుద్ధమని పేర్కొంటూ, రాధాకృష్ణ పై వెంటనే కేసులు నమోదు చేసి రాష్ట్రంలోని మహిళలందరికీ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల గౌరవాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. అదేవిధంగా రాష్ట్ర రాజధాని అంశంపై స్పందిస్తూ, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిపాదించిన వికేంద్రీకరణ విధానం రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు ప్రాంతాలను కేంద్రంగా చేసుకుని "మావిగ" అభివృద్ధి నమూనా ద్వారా అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. లక్షల కోట్ల రూపాయల వ్యయం చేసి అమరావతి నిర్మాణం చేపట్టడం కంటే ఇప్పటికే అభివృద్ధి చెందిన ప్రాంతాలను రాజధాని కేంద్రంగా తీసుకోవడం రాష్ట్రానికి ఆర్థికంగా మేలు చేస్తుందని అభిప్రాయపడ్డారు. అప్పుల భారం ప్రజలపై మోపడం సమంజసం కాదని స్పష్టం చేశారు. తదుపరి మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి అధినేత రాధాకృష్ణ మహిళల పట్ల అవమానకరంగా మాట్లాడటం తీవ్రంగా ఖండనీయమన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు సమాజంలో చెడు సందేశాన్ని పంపుతున్నాయని పేర్కొంటూ, ఆయనపై వెంటనే కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మహిళల గౌరవాన్ని దెబ్బతీసే ఎలాంటి వ్యాఖ్యలనైనా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. రాష్ట్ర రాజధాని అంశంపై ఆయన మాట్లాడుతూ, అమరావతి పేరుతో కొందరు రాజకీయ నాయకులు స్వప్రయోజనాలు సాధించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. రాజధాని ప్రకటనకు ముందే భూములు కొనుగోలు చేసి లాభాలు పొందేలా ప్రణాళికలు రూపొందించారని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పుల బారిన పడేసే విధంగా రాజధాని నిర్మాణం చేయడం కంటే అభివృద్ధి చెందిన ప్రాంతాలను వినియోగించుకోవడం ద్వారానే సమగ్ర అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఈశ్వర్ ప్లే స్కూల్ ప్రారంభించిన రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్






మన గళం,షరీన్ నగర్ : నగరంలోని స్థానిక షరీన్ నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఈశ్వర్ ప్లే స్కూల్ ను రాజ్యసభ మాజీ సభ్యుడు టిజి వెంకటేష్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక వసతులతో చిన్న పిల్లలకు అవసరమైన ఏర్పాట్లతో ఈశ్వర్ ప్లే స్కూలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్లే స్కూల్ నందు చేరే చిన్న పిల్లల రక్షణ కొరకు మేనేజ్మెంట్ అన్ని రకాల ఏర్పాట్లు చేసిందని టీజీ వెంకటేష్ తెలిపారు. చిన్నపిల్లల్లో ఆటపాటలతో పాటు విద్య పట్ల ఆసక్తి కనబరిచే విధంగా అన్ని వసతులను ఏర్పాటు చేయడం వారి చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. లాబాపేక్ష లేకుండా చిన్నపిల్లలను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నం ప్రారంభించిన ఈశ్వర్ ప్లే స్కూల్ అనతి కాలంలోనే వృద్ధిలోకి రావాలని కోరుకుంటున్నట్టు టీజీ తెలిపారు. నేటి బాలలే, రేపటి భావి భారత పౌరులని అటువంటి పౌరులను చిన్నప్పటినుంచే సన్మార్గంలో పయనించే విధంగా ప్లే స్కూల్ యాజమాన్యం కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్ ప్లే స్కూల్ యాజమాన్యం ఈశ్వర్ బాబు, వెంకటేష్ తేజ, త్రినాథ్, లీలావతి ఆర్యవైశ్య నాయకుడు రాజగోపాల్, అడ్వకేట్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి: కలెక్టర్

**– విధులకు గైర్హాజరు అయితే కఠిన చర్యలు – ఆన్‌లైన్ హాజరు లోపాలపై షోకాజ్ నోటీసులు – జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**




మన గళం,నంద్యాల/బేతంచర్ల : సచివాలయ సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరియు సేవలను సమర్థవంతంగా ప్రజలకు చేరవేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. గురువారం బేతంచెర్ల మండలం ఆర్. కొత్తపల్లె గ్రామంలోని స్వర్ణ గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది ఆన్‌లైన్ హాజరు నమోదును పరిశీలించారు. విధులకు హాజరుకాని పంచాయతీ గ్రేడ్–5 సిబ్బంది మరియు వీఆర్వోపై షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. సిబ్బంది ఎవరెవరు ఏ విధులు నిర్వహిస్తున్నారనే అంశంపై కలెక్టర్ వివరణ కోరారు. సచివాలయంలో నిర్వహిస్తున్న వివిధ రిజిస్టర్లను సమగ్రంగా పరిశీలించి, వాటి నిర్వహణపై సూచనలు ఇచ్చారు. సచివాలయ ఆవరణలో పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. పబ్లిక్ పర్సెప్షన్ సర్వేలో సాధించిన పురోగతి, ప్రజలు అడుగుతున్న ప్రశ్నలు, వాటిపై లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నారా లేదా అనే అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రీసర్వేకు సంబంధించి వీఆర్వో, సర్వేయర్ అందుబాటులో లేరని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మిగిలిన సచివాలయ సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. అలాగే ప్రజా ఫిర్యాదుల విభాగం పనితీరును కూడా కలెక్టర్ సమీక్షించారు.

# కొత్తబురుజులో ఇంటింటికీ శుద్ధజలానికి శ్రీకారం

- రూ.30 లక్షలతో నల్లా కనెక్షన్ల పనుల ప్రారంభం
- సీఎం హామీ అమలు దిశగా వేగంగా అడుగులు
- స్వచ్ఛ భారత్ కింద మరుగుదొడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు
- హార్టికల్చర్‌తో రైతులకు అధిక ఆదాయం అవకాశాలు
- 100 రోజుల ప్రణాళికతో నీటి భద్రతకు చర్యలు
- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా





మన గళం,డోన్/నంద్యాల : డోన్ మండలం కొత్తబురుజు గ్రామంలో ఇంటింటికీ శుద్ధజలాన్ని అందించే లక్ష్యంతో కొళాయి కనెక్షన్ల పనులను ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. గురువారం కొత్తబురుజు గ్రామంలో జిల్లా మినరల్ ఫండ్ నుంచి రూ.30 లక్షల వ్యయంతో చేపట్టిన ఈ పనులను డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డితో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత నెల 9వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గ్రామ పర్యటనలో ఇచ్చిన హామీ మేరకు ఈ పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. గ్రామంలోని ప్రతి ఇంటికి శుద్ధమైన తాగునీరు అందించడం ద్వారా ప్రజల ఆరోగ్యానికి, జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహదం కలుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా, స్వచ్ఛ భారత్ మిషన్ కింద మరుగుదొడ్లు లేని 30 మంది లబ్ధిదారులకు రూ.4.5 లక్షలతో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ పనులను కూడా ప్రారంభించామని తెలిపారు. ఈ చర్యలతో గ్రామంలో పరిశుభ్రత పెరగడంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు బలం చేకూరుతుందని అన్నారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన గతంలో కోరిన ఆరు పనులను ఇప్పటికే మంజూరు చేశామని, అవి సకాలంలో పూర్తయ్యేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. మిగిలిన పనులను కూడా వారం నుంచి పది రోజుల్లో మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించిన కలెక్టర్, చెరువులు, ఫీడర్ ఛానల్స్ అభివృద్ధి వంటి పనులు పూర్తయితే భూగర్భ జలమట్టం పెరిగి అందరికీ ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం ప్రజలంతా ఐక్యంగా సహకరించాలని పిలుపునిచ్చారు.

హార్టికల్చర్ రైతులకు బంగారు భవిష్యత్ : జిల్లాలో సుమారు 7 లక్షల ఎకరాల్లో సాగవుతున్న సాధారణ పంటల ద్వారా రూ.4,000 కోట్ల ఆదాయం వస్తుండగా, కేవలం 49 వేల హెక్టార్లలో సాగవుతున్న ఉద్యానవన పంటల ద్వారా రూ.7,000 కోట్ల ఆదాయం లభిస్తోందని తెలిపారు. ఇందులో డోన్ నియోజకవర్గం కీలక పాత్ర పోషిస్తోందని వెల్లడించారు. రైతులు హార్టికల్చర్ పంటలపై దృష్టి సారిస్తే మరింత లాభదాయకంగా ఉంటుందని సూచించారు.

100 రోజుల ప్రణాళికతో నీటి భద్రత : నియోజకవర్గంలోని ప్రతి చెరువును నింపడం, ఫీడర్ ఛానల్స్ శుభ్రపరచడం వంటి పనులకు ప్రాధాన్యతనిస్తూ 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు తెలిపారు. బోరు బావులపై ఆధారపడే రైతులకు నీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రజల సహకారమే అభివృద్ధికి మూలం : గ్రామాభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కావాలంటే ప్రజల సహకారం అత్యంత అవసరమని, అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే ఆరోగ్యవంతమైన, అభివృద్ధి చెందిన గ్రామాన్ని నిర్మించగలమని కలెక్టర్ పిలుపునిచ్చారు. డోన్ శాసనసభ్యుడు కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా శుద్ధమైన తాగునీటిని అందించడం కోసం కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా నెరవేర్చుతామని, నీటి కొరత సమస్యను పూర్తిగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పెన్షన్లు, ఇళ్ల నిర్మాణం, రహదారుల అభివృద్ధి వంటి పలు సంక్షేమ కార్యక్రమాలు ఇప్పటికే అమలు చేశామని తెలిపారు. అలాగే, డ్రిప్ ఇరిగేషన్ మరియు స్ప్రింక్లర్ పద్ధతులను తిరిగి ప్రవేశపెట్టి నీటి వినియోగాన్ని తగ్గిస్తూ రైతుల ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

# ఏబీఎన్ రాధాకృష్ణను తక్షణమే అరెస్ట్ చేయాలి



**– వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ డిమాండ్**

మన గళం కోడుమూరు: కోడుమూరు: మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన ఏబీఎన్ రాధాకృష్ణపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కోడుమూరు పోలీస్ స్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశారు ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన డాక్టర్ సతీష్, రాధాకృష్ణ వ్యాఖ్యలు సమాజంలో మహిళల గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి బూతు రాతలు, వ్యాఖ్యలను ఏ మాత్రం సహించబోమని స్పష్టం చేశారు. చట్టం అందరికీ సమానమైతే, వెంటనే చర్యలు తీసుకుని ఆయనను అరెస్ట్ చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు. అంతేకాక, గతంలో సాక్షి కార్యాలయంపై దాడి జరిగినప్పుడు పోలీసులు సరైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. అప్పట్లో దాడులు జరిగి కార్యాలయాన్ని తగలబెట్టినా, పోలీసులు అడ్డుకోలేదని గుర్తు చేశారు. అయితే ఇప్పుడు అదే విధంగా తప్పు చేసిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు వైఎస్సార్‌సీపీ నేతల కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేసినా, కూటమి నాయకులు వాటిని సమర్థించడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. మహిళల గౌరవాన్ని కించపరిచే ఘటనలు జరుగుతున్నప్పటికీ, బాధితులకు మద్దతుగా ఎవరూ స్పందించకపోవడం ఆందోళనకరమని డాక్టర్ సతీష్ పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళల భద్రత, గౌరవం కాపాడాలంటే ఇలాంటి ఘటనలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని ఆయన హెచ్చరించారు. రాధాకృష్ణపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుని, అరెస్ట్ చేయాలని, లేనిపక్షంలో పార్టీ తరపున ఆందోళనలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, మహేశ్వర్ రెడ్డి, కోడుమూరు మండల రైతు విభాగం అధ్యక్షులు వెంకటేశ్వర్లు, బూత్ కమిటీ జిల్లా సభ్యులు రమేష్, నాగభూషణ్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నాం.

# హ్యుండయ్ కార్ల ధరల పెంపు




న్యూఢిల్లీ, మన గళం : ప్రముఖ కార్ల తయారీ సంస్థ హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే మే 1 నుంచి తన పోర్టుఫోలియోలోని అన్ని కార్ల ధరలను 1 శాతం వరకు పెంచనున్నట్లు ప్రకటించింది. ఇన్‌పుట్ వ్యయాలు గణనీయంగా పెరగడం వల్ల కంపెనీపై ఆర్థిక భారం అధికమైందని, దాన్ని కొంతవరకు వినియోగదారులకు బదిలీ చేయాల్సిన అవసరం ఏర్పడిందని సంస్థ వెల్లడించింది. ఉత్పత్తి ఖర్చులు, ముడి సరుకుల ధరలు, రవాణా వ్యయాలు పెరగడం ఈ నిర్ణయానికి ప్రధాన కారణాలుగా పేర్కొంది. ఈ ధరల పెంపు మే 1 నుంచి అమల్లోకి రానుండగా, వివిధ మోడళ్లపై పెరుగుదల శాతం స్వల్పంగా మారవచ్చని కంపెనీ తెలిపింది. దీంతో కొత్త కార్లు కొనాలనుకునే వినియోగదారులు ముందుగానే కొనుగోలు చేయాలని పరిశ్రమ వర్గాలు సూచిస్తున్నాయి.

# నీటిసంరక్షణ, జలవనరుల పరిరక్షణపై ఎమ్మెల్యే పర్యటన...





నందవరం ఏప్రిల్ 9 మనగళం న్యూస్ : నందవరం మండలంలోని మూడు చెరువులను సందర్శించిన ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్రెడ్డి ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సాగునీటి సంఘాల బాధ్యత' కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పర్యటించనున్నారు. తిమ్మారెడ్డి కుంట గర్వణకుంట మరియు పూల చింతచెరువు చెరువును సందర్శించారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ కరవురహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంతో వేసవికి ముందు 6 మీటర్లు, వానాకాలం పూర్తయ్యేనాటికి 3 మీటర్ల లోతులో భూగర్భజలాలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. దీనికి అనుగుణంగా నేటి నుంచి వంద రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా నీటి సంరక్షణ–జలవనరుల పరిరక్షణ అంశాలే అజెండాగా కార్యక్రమాలు నిర్వహించనుంది. రాష్ట్రంలో నీటి భద్రత సాధిస్తే ఇతర రంగాల్లో అభివృద్ధి సుసాధ్యం అవుతుందని స్పష్టం చేశారు. కరవు రహిత ఆంధ్రప్రదేశ్ చేయటమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని వేసవి కంటే ముందు 6 మీటర్లు, వర్షపు సీజన్ పూర్తి అయ్యే నాటికి 3 మీటర్ల లోతులో భూగర్భజలాలు అందుబాటులో ఉండాలని ఆయన నిర్దేశించారు. నేటి వంద రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే నీటి సంరక్షణ–జలవనరుల పరిరక్షణ కార్యాచరణను ప్రకటించారు.

నీటిసంరక్షణ, జలవనరుల పరిరక్షణపై వందరోజుల కార్యాచరణ ప్రకటించిన నేటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఇరిగేషన్, వ్యవసాయం, పంచాయితీరాజ్, అటవీ, పశు సంవర్ధక శాఖలు సంయుక్తంగా ఈ జల సంరక్షణ కార్యక్రమాల్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. సాగునీటి సంఘాలు కేంద్రీకృతంగా యాక్షన్ ప్లాన్ అమలు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. నీటి భద్రత అంశంలో ప్రజలను భాగస్వాములను చేయాలని దీన్నో ప్రజా ఉద్యమంగా మలచాలని దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు ఏప్రిల్ 6 నుంచి జులై 14వ తేదీ వరకు నాలుగు దశల కార్యాచరణను . ఏప్రిల్ 6 నుంచి ఏప్రిల్ 15 తేదీ వరకు పనుల గుర్తింపు కార్యక్రమం చేపట్టాలని ఏప్రిల్ 16 నుంచి 20వ తేదీ వరకు గుర్తించిన పనులకు పరిపాలనా అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. ఏప్రిల్ 21 నుంచి జూలై 9వ తేదీ వరకు పనులను చేపట్టాలని, జూలై 10 నుంచి 14 జూలై పూర్తి చేసిన పనులకు సంబంధించిన నివేదికలను సమర్పించాలని తెలియజేశారు నీటి పొదుపును కీలకాంశంగా తీసుకుని ప్రతీ నీటి బొట్టనూ ఒడిసిపట్టేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మండల కన్వీనర్ ఖాసింవాలి మాజీ మార్కెట్ యార్డ్ దేశాయ్ మాధవరావు మాజీ జెడ్పిటిసి పుష్పవతమ్మ రైస్ మిల్ నారాయణరెడ్డి మరియు ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు మరియు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## దత్తాత్రేయ స్వామి వారికి విశేషపూజలు




మనగళం శ్రీశైలం : లోకకల్యాణంకోసం దేవస్థానం ఈ రోజు (09.04.2026) ఆలయప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద నెలకొని ఉన్న శ్రీ దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలను నిర్వహించింది. ప్రతి గురువారం దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. ఈ పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజను జరిపించబడింది. ఆ తరువాత దత్తాత్రేయస్వామివారికి పంచామృతాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి. లోకోద్ధరణకోసమై బ్రహ్మ,విష్ణు,మహేశ్వరులు ఒకే స్వరూపములో దత్తాత్రేయునిగా అవతరించారు. అందుకే త్రిమూర్తి స్వరూపునిగా దత్తాత్రేయుడు ప్రసిద్ధుడు. కాగా శ్రీశైలక్షేత్రానికి దత్తాత్రేయుల వారికి ఎంతో దగ్గర సంబంధం ఉంది. ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద దత్తాత్రేయులవారు తపస్సు చేశారని ప్రతీతి. అందుకే ఈ వృక్షానికి దత్తాత్రేయ వృక్షమని పేరు. కాగా దత్తాత్రేయస్వామివారు కలియుగంలో గోదావరితీరాన పిఠాపురంలో శ్రీపాదవల్లభునిగా జన్మించారు. వీరు ఒకసారి శ్రీశైలక్షేత్రంలోనే చాతుర్మాస్య వ్రతాన్ని ఆచరించినట్లుగా గురుచరిత్రలో చెప్పబడింది. కాగా శ్రీపాదవల్లభుడు తమ శిష్యులకు ఆయా తీర్థక్షేత్రాల మహిమావిశేషాలను పేర్కొనే సందర్భంలో కూడా శ్రీశైలాన్ని పలుసార్లు ప్రస్తావించారు. శ్రీపాదవల్లభుల జన్మ తరువాత మహారాష్ట్రలోని కరంజినగరములో నృసింహసరస్వతి స్వామిగా దత్తాత్రేయస్వామివారు జన్మించారు.వీరు ఒకసారి మహాశివరాత్రి రోజున శ్రీశైలమల్లికార్జునుని సేవించినట్లుగా కూడా గురుచరిత్ర చెబుతోంది. నృసింహసరస్వతి వారు తమ అవతార సమాప్తిని శ్రీశైలంలోని పాతాళగంగలోనే చేశారు. కలియుగ ప్రభావం రోజు రోజుకు ఎక్కువకావడముతో, నృసింహసరస్వతీస్వామి అదృశ్య రూపములో ఉండి తన భక్తులను రక్షించాలని నిర్ణయించారు. దాంతో భౌతికదేహాన్ని త్యజించేందుకు నలుగురు శిష్యులతో కలిసి శ్రీశైలానికి వచ్చారు. శ్రీశైలంలోని కదళీవనం దగ్గర తమ శిష్యులు చూస్తుండగానే నృసింహసరస్వతిస్వామివారు అరటి ఆకులతో చేసిన ఒక ఆసనంపై కూర్చోని, కృష్ణానదిలో ప్రవేశించి, కొంతదూరం ఆ అరటిఆకులపైనే పయనిస్తూ, అదృశ్యమైనట్లు గురుచరిత్ర చెబుతోంది.

## ఘనంగా మన ఊరు-మన జెండా కార్యక్రమాలు



మన గళం,విశాఖపట్నం : గురువారం నగరంలో భాజపా మన ఊరు-మన జెండా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. కోస్టల్ బ్యాటరీ వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర భాజపా అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త తమ ఇంటి పైన జెండాను ఎగురవేయాలని సూచించారు.

## సైయెంట్ కినెటెక్ కొనుగోలు




న్యూఢిల్లీ, మన గళం :చిప్‌ల తయారీ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకోవడానికి సైయెంట్ అనుబంధ సంస్థ సైయెంట్ సెమికండక్టర్ కీలక అడుగు వేసింది. అమెరికాకు చెందిన పవర్ సెమికండక్టర్ సొల్యూషన్ సంస్థ కినెటిక్ టెక్నాలజీలో మెజార్టీ వాటాను కొనుగోలు చేసింది. ఈ ఒప్పందం ద్వారా సుమారు 74 శాతం వాటాను రూ.785 కోట్లకు హస్తగతం చేసుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. చిప్‌ల యారీలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం లక్ష్యంగా ఈ భాగస్వామ్యాన్ని ఏర్పరచుకున్నట్లు సంస్థ అధికారులు తెలిపారు. అమెరికా సంస్థతో కలిసి పనిచేయడం ద్వారా సెమికండక్టర్ రంగంలో తన స్థాయిని మరింత బలోపేతం చేసుకోవాలని సైయెంట్ భావిస్తోంది. ఈ కొనుగోలు ద్వారా గ్లోబల్ మార్కెట్లో పోటీ సామర్థ్యం పెరిగే అవకాశముందని నిపుణులు అంచనా వేస్తున్నారు. సైయెంట్ సెమికండక్టర్ ప్రధాన అధికారి సుమన్ నారాయణ్ మాట్లాడుతూ, భవిష్యత్తులో చిప్‌ల తయారీ రంగంలో పెద్ద అవకాశాలు ఉన్నాయని, వాటిని వినియోగించుకునేందుకు ఈ ఒప్పందం కీలకమని తెలిపారు. ఈ భాగస్వామ్యం ద్వారా సాంకేతిక పరిజ్ఞానం, ఉత్పత్తి సామర్థ్యం రెండింటినీ విస్తరించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.

# శ్రీశైలం కుంభోత్సవంలో ఇబ్బందులు





- ఫలించని అధికారుల ప్రణాళికలు
- విధానాల్లోనే మార్పు రావాలి: ట్రస్టుబోర్డు సభ్యుడు అనిల్ కుమార్
- కుంభోత్సవంలో భక్తుల రద్దీ

మనగళం శ్రీశైలం : కుంభోత్సవంలో దేవస్థానం అనుకున్న ప్రణాళికలు ఫలించకపోవడంతో సామాన్య భక్తులు దర్శనం కోసం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కుంభో త్సవం కేవలం గ్రామస్థులకు సంబంధించినదని, బయటి నుంచి వచ్చిన వీవీఐపీలకు ప్రాధాన్యత కల్పించడం సమంజసం కాదని శ్రీగిరి, విష్ణుగిరి, బ్రహ్మగిరికి చెందిన స్థానిక భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది మాత్రమే కాదు, దర్శన విధానాలు, ఆలయ పరిపాలనా వ్యవస్థలోనే మార్పు రావాలని ట్రస్టుబోర్డు సభ్యుడు అనిల్ కుమార్ అన్నారు. కుంభోత్సవానికి రెండు రోజుల ముందునుంచి ఆలయ ప్రాకారంలో ట్రయిల్ రన్ నిర్వహించిన సంబంధిత అధికారులు ఉత్సవ సమయంలో నిర్ణీత ప్రణాళికలు అమలుపర్చకపోవడంతో అధికారులు, సిబ్బంది సమన్వయలోపంతో సమస్యలు తలెత్తాయని అన్నారు. ఆలయ ప్రతిష్ఠతకు భంగం కలిగించవద్దు– ఈవో శ్రీనివాసరావు కుంభోత్సవానికి సామాన్య భక్తులకే అధిక ప్రాధాన్యత కల్పిస్తూ దర్శన ఏర్పాట్లు చేసినప్పటికీ కొద్ది సమయం ఆలస్యమయినందు వల్ల దర్శనం కోసం ఇబ్బందులు ఎదురయ్యాయి. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో పాటు ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, కొందరు ప్రజాప్రతినిధులు, వీఐపీల రెఫరెల్స్ ఉన్నందున దర్శన సమయం ఎక్కువైంది. ఇదే అదు నుగా కొందరు ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా దేవస్థానం పరిపాలనా తీరును విమర్శిస్తున్నారు.


## శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న తెలంగాణ దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ





మనగళం శ్రీశైలం : అమ్మవారిని తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ బుధవారం దర్శించుకున్నారు. ఆలయ రాజగోపురం వద్ద ఈవో శ్రీనివాసరావు, అర్చకులు ఆమెకు ఘనస్వాగతం పలికారు మంత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వేద పండితులు ఆమెకు ఆశీర్వచనాలు అందించి, శేష వస్త్రం, లడ్డూ ప్రసాదాలు, చిత్రపటంతో సత్కరించారు

# ఎమ్మెల్యే చేతుల మీదుగా పోషణ్ పక్వాడా కార్యక్రమలు




- ఐసీడీయస్ ప్రాజెక్ట్

నందవరం ఏప్రిల్ 9 మన గళం న్యూస్ : మహిళభివృద్ధి శిశుసంక్షేమ శాఖ యెమ్మిగనూరు ఐసీడ్స్ ప్రాజెక్ట్ పరిధిలోని గోనెగండ్ల, యెమ్మిగనూరు, నందవరం మండలాలలో ఏప్రిల్ 9 వతేది నుండి 23 వతేది వరకు పోషణ్ పక్వాడ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. ఈ పోషణ్ పక్కవాడ కార్యక్రమమం నందవరం మండలం నందు గౌరవనీయులు మీాూ శ్రీ బీవీ జాయ నాగేశ్వరెడ్డి గారి ద్వారా పోషణ్ పక్వాడ పోస్టర్స్ ఆవిష్కరించడం జరిగినది. ఈ కార్యక్రమం లో మండల నాయకులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ 15 రోజులు జరిగే పోషణ్ పక్కవడ కార్యక్రమాలలో గర్భిణీ బాలింతల పిల్లల కు మెరుగైన ఆరోగ్య సేవలు సమగ్రంగా అందించాలని బిడ్డ పుట్టినప్పటి నుంచి 2 సంవత్సరాలు వచ్చేలోపు బిడ్డ యొక్క మెదడు అభివృద్ధి 80% జరుగుతుందని. ఈ వయస్సులో పిల్లలయొక్క పోషణ - సంరక్షణ అనేది ముఖ్యం. కాబట్టి ఈ వయస్సులో పిల్లలకు మొబైల్స్ కీ దూరంగా ఉంచాలని, అట్లాగే ప్రాసెసింగ్ ఫుడ్స్ కీ , రెడీ టు కుక్, ఆహారపదార్థాల వినియోగన్ని పూర్తిగా గా తగ్గించి సహజమైన మరియు పోషక విలువలు గల ఆహారపదార్థాలను ఇంట్లోనే తయారు చేసి ఇవ్వాలి. బయటి ఆహార పదార్థాలలో అధిక సోడియం, స్టేబ్లీజర్ చేసిన ఆహారపదార్థాలు, కుర్ కురెలు, చిప్స్ , మ్యాగీ లు జంక్ ఫుడ్స్ ఇవ్వడం పిల్లలకు హానికరం కాబట్టి వాటి బదులుగా ఇంట్లో తయారు చేసుకున్న ఆహార పదార్థాలు పల్లీలు, పప్పులు, అన్నిరకాల గుగ్గిళ్లు శనగలు, అని రకాల పండ్లు, వంటి ఆరోగ్యాకరమైన ఆహారపదార్థాలను పిల్లలకు స్నాక్స్ గా ఇవ్వాలని చెప్పడం జరుగుతుంది. ఈ పోషణ్ పక్కవాడ కార్యక్రమాల్లో పురుషుల భాగస్వామ్యం కావాలి.పిల్లల సమగ్ర అభి వృద్ధి అనేది జరగాలంటే తల్లి,తండ్రి ఇద్దరీ బాధ్యత ఉంది. ఈ పోషణ్ పక్కవాడ కార్యక్రమాలు ప్రతి ాాషె లో నిర్వహిస్తాము. ఈ కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులు వివిధ శాఖ అధికారులు అందరు పాల్గొని విజయవంతం చేయాలి. ఈ పోషణ్ పక్వడ కార్యక్రమలలో ఆరోగ్య శాఖ వారి సమన్వయము తో ప్రైవేట్ హాస్పిటల్స్ ప్రభుత్వ హాస్పిటల్స్ లలో కూడా తల్లి తండ్రులకు పిల్లల పోషణ - సంరక్షణ గురించి తల్లి తండ్రులకు అవగాహనా కలిగిస్తాము.

## కోడుమూరు పాత బస్టాండ్ నందు చలివేంద్ర ఏర్పాటు చేసిన ఎంపీడీవో ఏసీ రాముడు






మన గళం కోడుమూరు: కోడుమూరు గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా పంచాయతీ పరిధిలోని వాటర్ మెయిన్స్ ని సానిటేషన్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసుకొని గ్రామపంచాయతీలో ఎటువంటి నీటి సమస్య లేకుండా ప్రజలందరూ నీటి సమస్యలు ఎదుర్కొనకుండా తగు జాగ్రత్తలు తీసుకొని ప్రతి ఇంటికి నీటిని సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించడం అదేవిధంగా శానిటేషన్ సిబ్బంది అందరూ కూడా వారికి కేటాయించినటువంటి వీధులలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించవలెనని సూచనలు ఇస్తూ తడి చెత్త పొడి చెత్త వేరు చేసే విధానాన్ని హౌసోల్డ్ దగ్గర అవగాహన కల్పిస్తూ చెత్త సేకరణ కార్యక్రమం చేయమని తెలియజేయడమైనది అదే విధంగా కోడుమూరు పాత బస్టాండ్ ఆవరణలో ప్రజల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రయాణికుల కు నీటి దాహార్తిని తీర్చేందుకు గ్రామపంచాయతీ తరఫున ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఐపీఎల్‌లో కొత్త నిబంధనలు అమలు



హైదరాబాద్,మన గళం: ఐపీఎల్ 2026 సీజన్‌లో క్రికెట్ నియంత్రణ సంస్థ కొత్త నిబంధనలను అమలు చేస్తోంది. ముఖ్యంగా బెంచ్‌పై ఉండే ఆటగాళ్ల ప్రవర్తనపై కట్టుదిట్టమైన నియంత్రణలు విధించబడుతున్నాయి. మ్యాచ్ సమయంలో అవసరం లేని కదలికల వల్ల సమయం వృథా అవుతుందనే కారణంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. కొత్త నిబంధనల ప్రకారం మ్యాచ్ జరుగుతున్న సమయంలో బెంచ్‌పై ఉన్న ఆటగాళ్లు స్టేడియం చుట్టూ స్వేచ్ఛగా తిరగరాదు. జట్టు యాజమాన్యం ఇచ్చిన 16 మంది ఆటగాళ్ల జాబితాలో లేని వారు ఎవరూ మైదానంలోకి ప్రవేశించకూడదు. అలాగే సబ్‌స్టిట్యూట్ ఆటగాళ్లు పదేపదే డ్రింక్స్, బ్యాట్లు, గ్లోవ్స్ లేదా డగౌట్ నుంచి సందేశాలు తీసుకురావడాన్ని నిషేధించారు. డ్రింక్స్ ఇవ్వడంపై కూడా స్పష్టమైన నియమాలు విధించారు. కేవలం వికెట్ పడినప్పుడు లేదా బౌండరీ వద్ద మాత్రమే ఆటగాళ్లకు పానీయాలు అందించాలి. అంపైర్ల అనుమతి లేకుండా మైదానంలోకి ఎలాంటి పానీయాలు తీసుకురావడం అనుమతించబడదు. ఇంకా, మైదానంలోకి వచ్చే ప్రతి ఆటగాడు తప్పనిసరిగా క్రికెట్ దుస్తులు ధరించి ఉండాలి. సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్‌లుగా లేని ఆటగాళ్లు బౌండరీ, కంచె మధ్య ప్రాంతంలో ఉన్నప్పుడు టీమ్ ట్రైనింగ్ బిబ్స్ ధరించడం తప్పనిసరి చేశారు. ఈ మార్పులతో మ్యాచ్‌ల నిర్వహణ మరింత క్రమబద్ధంగా సాగడంతో పాటు సమయపాలన మెరుగుపడుతుందని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి.

## మూడు నెలలే బతుకుతావన్నా.. యువరాజ్ అద్భుత పోరాటం




న్యూఢిల్లీ, మన గళం: భారత క్రికెట్ చరిత్రలో తనదైన ముద్ర వేసుకున్న మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ జీవితంలో క్యాన్సర్‌తో చేసిన పోరాటం ఇప్పటికీ ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తోంది. ఒక దశలో తాను మరో మూడు నుంచి ఆరు నెలలకు మించి బతకలేనని వైద్యులు చెప్పినా, క్రికెట్‌పై ఉన్న అపారమైన ప్రేమ, గెలవాలనే పట్టుదలతో ఆ పరిస్థితిని అధిగమించానని యువరాజ్ తాజాగా వెల్లడించాడు. తన కెరీర్‌లో అత్యంత కఠినమైన ఆ రోజులను గుర్తుచేసుకుంటూ అనేక భావోద్వేగ విషయాలను పంచుకున్నాడు. రెండువేల పదకొండులో భారతదేశంలో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో యువరాజ్ సింగ్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. జట్టును విజయంలోకి నడిపించిన అతను, అనేక కీలక మ్యాచ్‌లలో ఒత్తిడిని తట్టుకుని విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. అయితే ఆ టోర్నీ సమయంలోనే అతడు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మ్యాచ్‌ల సమయంలో నొప్పిని భరిస్తూ, కొన్నిసార్లు రక్తం వాంతి చేసినప్పటికీ జట్టు కోసం పోరాడిన యువరాజ్ నిజమైన యోధుడిగా నిలిచాడు. ప్రపంచకప్ ముగిసిన తర్వాత విదేశీ పర్యటనలకు సిద్ధమవుతున్న సమయంలో తన ఆరోగ్య సమస్యలు మరింత పెరిగాయని యువరాజ్ తెలిపాడు. టెస్టు జట్టులో చోటు దక్కబోతున్న ఆనందం మధ్యలోనే తనకు క్యాన్సర్ ఉన్నట్టు తెలిసి తీవ్ర షాక్‌కు గురయ్యానని చెప్పాడు. కెరీర్ అత్యుత్తమ దశలో ఉండగా ఒక్కసారిగా జీవితం చీకట్లోకి వెళ్లిపోయినట్టుగా అనిపించిందని పేర్కొన్నాడు. తరువాత వైద్యులను సంప్రదించగా ఊపిరితిత్తులు మరియు గుండె మధ్య భాగంలో కణితి ఉన్నట్టు నిర్ధారణ అయిందని యువరాజ్ వెల్లడించాడు. ఈ పరిస్థితిలో వెంటనే చికిత్స తీసుకోకపోతే ప్రాణాపాయం తప్పదని, కీమోథెరపీ చేయించుకోకపోతే మూడు నుంచి ఆరు నెలలకంటే ఎక్కువ బతకలేవని వైద్యులు స్పష్టంగా చెప్పారని తెలిపాడు. ఆ మాటలు విన్నప్పుడు తనకు ఏమి చేయాలో అర్థం కాలేదని, అయినప్పటికీ క్రికెట్ ఆడాలనే ఆలోచన మాత్రమే తన మనసులో తిరుగుతూనే ఉండేదని చెప్పాడు. అయితే పరిస్థితులు మరింత దిగజారడంతో విదేశాలకు వెళ్లి చికిత్స తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు. అక్కడ వైద్యులు తనకు ధైర్యం చెప్పి సరైన చికిత్స అందించడంతో తనలో మళ్లీ ఆశలు పుట్టాయని యువరాజ్ పేర్కొన్నాడు. కీమోథెరపీ సమయంలో శారీరకంగా బలహీనపడినా, మానసికంగా మాత్రం తాను కుంగిపోలేదని తెలిపాడు. క్రికెట్ తనకు ప్రాణం లాంటిదని, ఆ ఆటే తనను ముందుకు నడిపించిందని అన్నాడు. చికిత్స సమయంలో కూడా క్రికెట్ మ్యాచ్‌ల వీడియోలు చూస్తూ, మైదానంలో తిరిగి అడుగుపెట్టాలనే లక్ష్యంతో తన మనోధైర్యాన్ని నిలబెట్టుకున్నాడు. ఆ సమయంలో తన సహచర ఆటగాళ్లు, ముఖ్యంగా సీనియర్ క్రికెటర్లు వచ్చి ధైర్యం చెప్పడం తనకు ఎంతో బలాన్నిచ్చిందని గుర్తుచేసుకున్నాడు. కుటుంబ సభ్యుల మద్దతు కూడా తనకు ఆ కష్టకాలంలో అండగా నిలిచిందని చెప్పాడు. క్రమంగా ఆరోగ్యం మెరుగుపడడంతో యువరాజ్ మళ్లీ ఫిట్‌నెస్‌పై దృష్టి సారించాడు. విదేశాల్లో కొంతకాలం కఠినంగా శ్రమించి తన శరీరాన్ని తిరిగి సిద్ధం చేసుకున్నాడు. ఆ తర్వాత మైదానంలోకి తిరిగి వచ్చి మళ్లీ తన ప్రతిభను నిరూపించుకున్నాడు. ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొని తిరిగి అంతర్జాతీయ స్థాయిలో రాణించడం అరుదైన విషయం అని క్రీడా నిపుణులు కూడా అభిప్రాయపడుతున్నారు. యువరాజ్ సింగ్ జీవితం కేవలం ఒక క్రికెటర్ కథ మాత్రమే కాదు, కష్టాలను ఎదుర్కొని నిలబడే మనోబలానికి ప్రతీకగా నిలిచింది. ప్రాణాపాయం ఎదురైనా వెనక్కి తగ్గకుండా పోరాడితే విజయం సాధించవచ్చని అతని జీవితం చెబుతోంది. ప్రస్తుతం యువ ఆటగాళ్లకు మార్గనిర్దేశం చేస్తూ తన అనుభవాన్ని పంచుకుంటున్న యువరాజ్, జీవితంలో ఎదురయ్యే ఎలాంటి కష్టాన్నైనా ధైర్యంగా ఎదుర్కోవాలని యువతకు సందేశం ఇస్తున్నాడు.

## డేవిడ్ మిల్లర్ మైదానంలోనే ఏడ్చేశాడు



ఢిల్లీ, మన గళం:ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో బుధవారం రాత్రి జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ స్టార్ బ్యాటర్ డేవిడ్ మిల్లర్ మైదానంలోనే కన్నీరు పెట్టడం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. డెల్టీ మ్యాచ్‌లో మిల్లర్ చేసిన ఒక చిన్న పొరపాటు కారణంగా అతను తీవ్ర ఆవేదన చెందాడు.

ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్ మధ్య మ్యాచ్ చివరి బంతి వరకు ఉత్కంఠ కొనసాగింది. గుజరాత్ టైటాన్స్ ఒక్క పరుగు తేడాతో గెలిచింది. చివరి 2 బంతుల్లో 2 పరుగులు చేయాల్సిన సమయంలో మిల్లర్ స్వయంగా మ్యాచ్ ఫినిష్ చేయాలనుకుని పరుగు తీయకుండా నిర్ణయం తీసుకున్నాడు. కానీ చివరి బంతిని కనెక్ట్ చేయలేకపోయి రన్ కోసం ప్రయత్నంలో కుల్దీప్ యాదవ్ రనౌట్ అయ్యాడు. ఫలితంగా ఢిల్లీ ఒక్క పరుగుతో ఓడిపోయింది. ఐపీఎల్ ఆఫీసియల్ ఎక్స్ హ్యాండిల్‌లో విడుదలైన వీడియోలో మిల్లర్ భావోద్వేగంలో మునిగినట్లుగా, కోచ్ హేమంగ్ బదానీ అతన్ని ఓదార్చుతూ కనిపించారు. ఈ ఓటమితో టైటాన్స్ తమ మూడో మ్యాచ్‌లో పాయింట్ల ఖాతాను తెరిచినప్పటికీ, ఢిల్లీ విజయాన్ని చేజార్చుకుని నిరాశలో మునిగింది.

## బంగ్లాదేశ్-భారత్ క్రికెట్ సంబంధాలు పునరుద్ధరణకు తమీమ్ ప్రయత్నాలు




డాకా, మన గళం:బంగ్లాదేశ్‌లో రాజకీయ మార్పుల వెంటనే క్రికెట్ బోర్డులో కూడా విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. కొత్త ప్రధానమంత్రిగా తారిఖ్ రెహమాన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత, బోర్డును స్థిరంగా చలింపజేయడం కోసం మాజీ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్‌ను బాధ్యులుగా నియమించారు.

బోర్డులో నెలకొన్న అస్థిరతను తొలగించడానికి 11 మంది సభ్యులతో కూడిన అడ్-హాక్ కమిటీని ఏర్పాటు చేసి, అధ్యక్షుడిగా తమీమ్ బాధ్యతలు చేపట్టారు. రాబోయే 90 రోజులలో పారదర్శక ఎన్నికలు నిర్వహించి, బోర్డును నూతన యాజమాన్యం వద్దకు హస్తాంతర పరచడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

అతి ఇటీవల జరిగిన టీ20 వరల్డ్ కప్ 2026 సమయంలో భారత్ పర్యటనకు నిరాకరించడం వల్ల బంగ్లాదేశ్-భారత్ క్రికెట్ సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ అసహజ పరిస్థితిని సరిచేసేందుకు తమీమ్ చర్యలు ప్రారంభించారు. ఈ ఏడాది చివర్లో ద్వైపాక్షిక సిరీస్ కోసం టీమిండియాను బంగ్లాదేశ్‌కు ఆహ్వానిస్తూ, బీసీసీఐకి అధికారిక ప్రతిపాదనలు పంపించారు. తమీమ్ భావించనేది ఏమిటంటే, ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో భాగంగా భారత్ పర్యటన విజయవంతం అవడం ద్వారా రెండు దేశాల మధ్య క్రికెట్ బంధాన్ని మరింత బలోపేతం చేయవచ్చు.

# బాబర్ ఆజం విరాట్‌తో పోలికపై సీరియస్




ఇస్లామాబాద్, మన గళం: పాకిస్థాన్ సూపర్ లీగ్ 2026 సీజన్‌లో పెషావర్ జల్మీ కెప్టెన్ బాబర్ ఆజం తనదైన శైలిలో అసహనాన్ని వ్యక్తం చేశారు. బుధవారం కరాచీ వేదికగా హైదరాబాద్ కింగ్స్‌మెన్‌పై విజయం సాధించిన అనంతరం జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో, టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ప్రస్తావన రావడంతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఒక రిపోర్టర్ బాబర్ ఫినిషింగ్ సామర్థ్యంపై విమర్శిస్తూ "విరాట్ కోహ్లీ తన జట్టును ఒంటిచేత్తో గెలిపించినట్లుగా మీరు ఎందుకు చేయలేకపోతున్నారు?" అని అడగగా, బాబర్ ఆజం ఘాటుగా సమాధానం ఇచ్చారు. "మీరు ఏ ఉద్దేశంతో ఈ ప్రశ్న అడుగుతున్నారో నాకు అర్థమవుతోంది. ఆ చర్చను ఇక్కడితో ఆపేయండి" అని చెప్పి రిపోర్టర్ నోరు మూయించారు. తన కెరీర్‌లో ఎన్నో మ్యాచ్‌లను విజయవంతంగా ముగించానని, గణాంకాలు చూస్తే ఆ విషయం స్పష్టమవుతుందని బాబర్ తెలిపారు. బాబర్ సమాధానంపై నెటిజన్లు రెండు వర్గాలుగా విడిపోయారు. ఆయన అభిమానులు, గెలిచిన మ్యాచ్‌లో ఇలాంటి ప్రతికూల ప్రశ్నలు అడగడం సరికాదని వాదిస్తున్నా, విరాట్ కోహ్లీ అభిమానులు మరియు క్రికెట్ విశ్లేషకులు.. అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే బాబర్ ఫినిషింగ్ సామర్థ్యం, స్ట్రైక్ రేట్‌ను మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP. Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.